క్లుప్తంగా

ఎంపీని కలిసిన తాడ్వాయి గ్రామస్తులు



ఎంపీ సురేశ్ షెట్కార్‌ను కలిసిన నాయకులు

తాడ్వాయి : తాడ్వాయి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామపెద్దలు మంగళవారం హైదరాబాద్‌లో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తాడ్వాయిలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ సహకారంతో వీడీసీ, ఎస్‌వైసీ ఆధ్వర్యంలో నిర్మించిన కాంప్లెక్స్ భవనానికి నిధులను కేటాయించాలని కోరారు. స్పందించిన ఎంపీ భవనానికి రూ.10లక్షల ప్రొసిడింగ్‌తో పాటు, తాడ్వాయిలో ఓపెన్ జిమ్, మిని స్టేడియం నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వీడీసీ చైర్మన్ మేకల రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న సీపీవోకు సన్మానం



రాజారాంను సన్మానిస్తున్న అధికారులు

తాడ్వాయి: పదోన్నతిపొంది, కరీంనగర్‌కు బదిలీపై వెళుతున్న సీపీవో, మండలప్రత్యేక అధికారి రాజారాం సేవలను మరువలేమని డీఆర్‌డీఏ సురేందర్ అన్నారు. మంగళవారం తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, గ్రామ పనంచాయతీ కార్యదర్శులు మండల ప్రత్యేక అధికారి రాజారాం ఘనంగా సన్మానం చేశారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏవో నర్సిములు, ఎంఈవో రామస్వామి, గ్రామ కార్యదర్శులు, సిబ్బందిపాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

బాన్సువాడ రూరల్: టీజీఎస్ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రతినిధులు మంగళవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి డిపోలో ఫిర్యాదుల పెట్టెలు పెట్టించాల్సిందిగా కోరామన్నారు. యాక్సిడెంట్ మరణాలకు నష్టపరిహారం చెల్లిస్తున్న విధంగానే సహజ మరణాలకు కూడా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.రిక్రూట్‌మెంట్, పీఆర్‌సీ 2021 పై ఎండీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్‌వీ రెడ్డి, వెంకటచారీ, ఎర్రస్వామీకుమార్, పలువురు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ పోటీ చేస్తుంది'



కామారెడ్డి అర్బన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు బీఎస్పీ పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఈశ్వర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎం.హరిలాల్ నాయక్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో జుక్కల్ శాసనసభ నియోజకవర్గం ఇన్‌చార్జిగా న్యాయవాది చిత్తరి అశోక్ ను నియమించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల సురేష్, జిల్లా నాయకులు రోహిదాస్, ఎం.సాయిబాబు, జీవన్, ప్రభాకర్‌దాస్, దుబ్బాక నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీల్లోనే చేరాలని అధ్యాపకుల ప్రచారం



గాంధారిలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

గాంధారి(ఎల్లారెడ్డి): విద్యార్థుల కోసం మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కాలేజీల్లోనే చేరాలని ప్రచారం చేశారు. అన్ని అర్హతలున్న అధ్యాపకులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పదో తరగతి పాసైన విద్యార్థుల కోసం వెతుకుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్స్, బస్సు పాస్ సౌకర్యాలను వివరిస్తున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజగోపాల్, లక్ష్మణ్, విజయ్ కుమార్, రమేశ్, సరిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగులో రైతన్న బిజీ

- సిద్ధమవుతున్న నారుమడులు
- దుక్కులు దున్నుతున్న అన్నదాతలు



మత్తమాల శివారులో నారుమడిలో విత్తనాలు అలుకుతున్న రైతు

ఎల్లారెడ్డిరూరల్: ఖరీఫ్ పంటల సాగులో రైతులు బిజీ అయ్యారు. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో పాటు తొలకరి వర్షం కురవడంతో రైతులు పంటలను సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. పంట భూములలో దుక్కులు దున్నడంతో పాటు, నారుమడులను సిద్ధం చేస్తున్నారు. నారుమడులను సిద్ధం చేసి విత్తనాలను అలుకుతున్నారు.

ఎల్లారెడ్డిలో 16 వేల ఎకరాలలో పంటల సాగు..

ఎల్లారెడ్డి మండలంలో 16 వేల ఎకరాలలో ఖరీఫ్‌లో పంటలను సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. మండలంలో 15 వేల 900 ఎకరాలలో వరి పంట సాగు కానుండగా, 100 ఎకరాలలో మొక్కజొన్న, కంది, కూరగాయల సాగుకు జరగనున్నట్లు అంచనాలు సిద్ధం చేశారు. దీనికి సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచారు. ట్రాక్టర్లతో పంట పొలాలను దున్ని నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కిలో కాంప్లెక్స్, 20–20, డీఏపీ ఎరువులు వాడనుండడంతో అధికారులు సొసైటీలలో అందుబాటులో ఉంచారు. దీంతో పాటు 300 సంచుల జీలుగ విత్తనాలు ఇప్పటికే రైతులకు పంపిణీ చేశారు.

జోరుగా విత్తనాల కొనుగోళ్లు



మహ్మద్ నగర్‌లో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

నిజాంసాగర్(జుక్కల్): వర్షాలు కురుస్తుండటంతో ఎరువులు, విత్తనాల కొనుగోళ్ల కు రైతులు బారులు తీరుతున్నారు. సన్నరకాల పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మహమ్మద్ నగర్, నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, మద్నూర్, జుక్కల్, బిచ్కుంద,డోంగ్లి మండలాల్లోని ప్రయివేట్ ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మండల కేంద్రాలకు రైతులు తరలివస్తుండటంతో సందడి నెలకొంది.

అందుబాటులో అన్ని రకాల ఎరువులు

ఎల్లారెడ్డి మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులను సొసైటీలలో అందుబాటులో ఉంచాం. ఖరీఫ్ సీజన్‌లో ఎల్లారెడ్డి మండలంలో 16 వేల ఎకరాలలో సాగు చేసే ప్రణాళికను రూపొందించడం జరిగింది. దీని ఆధారంగానే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతున్నాం.

– నయీమొద్దీన్, మండల వ్యవసాయ అధికారి, ఎల్లారెడ్డి

కొమ్మినేని శ్రీనివాసరావును తక్షణమే విడుదల చేయాలి



అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



జాయింట్ కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

- ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- అడిషనల్ ఎస్పీ, జాయింట్ కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి

కామారెడ్డి టౌన్ : సాక్షి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అరెస్టు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫేడరేషన్ నాయకులు ఖండించారు. మంగళవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా జయింట్ కలెక్టర్ విక్టర్, జిల్లా అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ.. శ్రీనివాసరావుని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఏపీలో జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ కృష్ణమాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణమూర్తి, డాకూరి మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి రాములు, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ కే.దశరథ్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, జె. తిరుపతిరెడ్డి జర్నలిస్టులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత..



ఎల్లారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఎల్లారెడ్డి: జర్నలిస్టులను అరెస్టు చేయడం అమానుషమని ఎన్‌యూజేఐ జాతీయ ఉపాధ్యక్షులు రాజేందర్‌నాథ్ అన్నారు. సాక్షి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తు ఎల్లారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి జర్నలిస్టులతో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రాజ్‌కుమార్, శివకుమార్, యశ్వంత్‌పవార్, మహేష్, నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్, బన్సీలాల్, గౌస్, హన్మోద్దీన్, ముక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత తవ్వకం



ఆవరణలో తవ్వుతున్న ఇంకుడు గుంత

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జేసీబీ సహాయంతో ఇంకుడు గుంతను తవ్వారు. వర్షపు నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంత తీసినట్లు పాఠశాల హెచ్ఎం గంగాకిషన్ తెలిపారు. అలాగే సోమవారం కురిసిన గాలివానకు పాఠశాల ఆవరణలోని మూడు చెట్లు నెలకొరిగాయి. నేలకొరిగిన మొక్కలను జేసీబీతో తొలగించి, ఇంకుడు గుంతను తవ్వారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు, 12వ వార్డు ఇన్‌చార్జి చిన్నోళ్ల రజనీకాంత్‌రావు, చిన్నోళ్ల రామకృష్ణారావు, పెద్దోళ్ల గోపాల్‌రావు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి

- పలు చోట్ల హాస్టళ్లు, స్కూళ్లను పరిశీలించిన అధికారులు
- పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచన



లింగంపేట కస్తూర్బా బాలికల పాఠశాలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీవో సురేందర్



సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట/ఎల్లారెడ్డి/నిజాంసాగర్/భిక్కనూరు/తాడ్వాయి/బీబీపేట/ రామారెడ్డి : పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పించాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేటలోని కస్తూర్బా పాఠశాలను, ఎల్లారెడ్డిలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. వేసవి సెలవులు ముగిసి గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన వసతులను కల్పించాలన్నారు. గోపాల్‌పేట హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్మికులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర చారి మాట్లాడారు. మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌తోపాటు మోడల్‌స్కూల్ బాలికల హాస్టల్‌ను ఎంపీడీవో ప్రభాకరచారి పరిశీలించారు. రామారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు హెచ్ఎం ఆనంద్ అవగాహన కల్పించారు. లింగంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, మైనారిటీ గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహలను డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి సురేందర్ సందర్శించారు. కసూర్బా బాలికల గురుకుల పాఠశాలకు మహిళా సంఘాల సభ్యులు కుట్టిన దుస్తులను ప్రత్యేకాధికారికి అందజేశారు. పాఠశాలల పరిసరాలు, వంట గదులు, స్టోర్ రూమ్‌లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజన్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిజాంసాగర్ అచ్చంపేట ఎస్సీ బాలుర వసతి గృహంతో పాటు ఎస్సీ గురుకుల పాఠశాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారిణి రమాదేవి సందర్శించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలుర, బాలికల, మైనార్టీ బాలుర హాస్టల్స్‌ను ఎంపీడీవో ప్రకాష్ పరిశీలించారు. బీబీపేట మండల కేంద్రంలోని ఆయా పాఠశాలలు, హాస్టళ్లను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పరిశీలించారు. లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు బాలికల ఉన్నత పాఠశాల, శెట్పల్లి, నల్లమడుగు కాంప్లెక్సుల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈవో శౌకత్‌అలీ మాట్లాడారు. భిక్కనూరు మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మధ్యాహ్నభోజన ఏజెన్సీ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో రాజగంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. తాడ్వాయి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అన్నిప్రభుత్వ పాఠశాలల ప్రధానోప్యాయులు, మధ్యాహ్న భోజన హెల్పర్లకు మధ్యాహ్న భోజనాన్ని వండేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఎంఈవోరామస్వామి అవగాహన కల్పించారు.

సంక్షిప్తం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నస్రుల్లాబాద్: వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి దయానంద్ అన్నారు.మంగళవారం మండలం కేంద్రంలో గల పలు వీధుల్లో తిరుగుతూ కుండీలలో నిత్యం నీటిని మారుస్తూ ఉండాలని సూచించాలి. ఎంపీడీవో సూర్యకాంత్, వెంకటలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన అర్చకులు



మద్నూర్(జుక్కల్): అర్చక ఉద్యోగులతో సమానంగా ధూప దీప నైవేద్య అర్చక గ్రాంటు మంజూరు చేయడంతో మండల అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో మంగళవారం మండల అర్చక సంఘం సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు స్వామి అంజనప్ప, మండల అధ్యక్షుడు వెంకట్ మహారాజ్, అర్చకులు రాందేవ్ తివారి, అక్షయ్ మహారాజ్, దినేశ్ మహారాజ్ తదితరులున్నారు.

అమెరికాలో బీఆర్‌ఎస్ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలకు హాజరైన ఎల్లారెడ్డి న్యాయవాది



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన ప్రముఖ న్యాయవాది గోపాల్‌రావు అమెరికాలో జరుగుతున్న బీఆర్‌ఎస్ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలకు హాజరైనట్లు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం తెలిపారు. అమెరికాలోని పలు రాష్ట్రాలలో జరిగిన బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాలలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్‌తో పాటు ఎల్లారెడ్డికి చెందిన న్యాయవాది గోపాల్‌రావు హాజరైనట్లు వారు తెలిపారు.

రోడ్డు కోసం స్థలం వదిలి ఆస్పత్రి ప్రహరీ నిర్మించాలని వినతి



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ పక్కన నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి ప్రహరీని కాలనీ కోసం రోడ్డు స్థలం వదిలి నిర్మించాలని కాలనీ వాసులు మంగళవారం గ్రామ పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ హన్మంత్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన స్థలం దాంట్లో ఎనిమిది ఫీట్ల రోడ్డు కేటాయించాలని ఇళ్లలోకి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు.

నేటి చిత్రం

ఇనుప విద్యుత్ స్తంభం మార్చండి



భిక్కనూరులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

భిక్కనూరు: మండలకేంద్రంలోని పప్పులవాడలో విద్యుత్ ఇనుప స్తంభం ప్రమాదకరంగా మారింది. వాన చినుకులు కురిస్తే చాలు ఈ ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా అయి షాకు కొడుతుంది. విద్యుత్ అధికారుల దృష్టికి ఈ విషయం పలుమార్లు తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. వెంటనే ఇనుప విద్యుత్ స్తంభాన్ని మార్చాలి.

– జొర్రీగల లక్ష్మణ్, భిక్కనూరు

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200 | ఎల్లారెడ్డి : 97053 46576 | బాన్సువాడ : 94402 11363 | జుక్కల్ : 97053 46578

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పిట్లంలో లబ్ధిదారుకు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న అదనపు కలెక్టర్ చందర్ నాయక్

పెద్దకొడప్‌గల్/పిట్లం(జుక్కల్) : సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్ అధికారులకు సూచించారు.మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పాటు, ఉపాధి హామీ పనుల పథకాలపై సమీక్షించారు.

ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్, నిర్మాణ పనులను మంగళవారం అదనపు కలెక్టర్ చందర్ పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవోలు లక్ష్మీకాంత్‌రెడ్డి, కమలాకర్, మండల ప్రత్యేక అధికారి కిషన్, ఏపీవో సుదర్శన్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు

భిక్కనూరు : అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీచేసిందని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలోని దళితవాడలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేసి భూమి పూజ నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, నేతలు లింబాద్రి, దయాకర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

నాగిరెడ్డిపేట : మండలంలోని రాఘవపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పారిశుధ్యం అమలు తీరును డీఎల్‌పీవో సురేందర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలోని పలురికార్డులను ఆయన తనిఖీ చేశారు. దీంతో పాటు గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి జానకీ ఉన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



బేగంపూర్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి/భిక్కనూరు/పెద్దకొడప్‌గల్/బిచ్కుంద : జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేట్, వెంకటాపూర్ గ్రామాలలో మంగళవారం తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ సిబ్బందితో కలిసి సదస్సులు నిర్వహించారు. భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సునీత, ఆర్ఐ బాలయ్య పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దకొడప్ మండలం బేగంపూర్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ దశరథ్, నాయబ్ తహసీల్దార్ రవికాంత్ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బిచ్కుంద మండలం ఫత్లాపూర్, కందర్‌పల్లిలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో రైతులకు ఇబ్బందులు

నస్రుల్లాబాద్ : మండలంలోని బొమ్మన్ దేవ్ పల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఒకే గ్రామం మూడు శివార్లు అవ్వడంతో దరఖాస్తు దారులు గుమిగూడారు. తాగడానికి నీరు, కూర్చోడానికి కుర్చీలు లేక పోవడంతో సంబంధిత అధికారులు తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేశారు.



బొమ్మన్‌దేవ్‌పల్లిలో గుమికూడిన జనం

గాంధీ భవన్‌లో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కాసుల

బాన్సువాడ : హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన ప్రజా వినియోగ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను మంగళవారం ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ స్వీకరించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సూచన మేరకు ప్రతి రోజు ఇద్దరు ప్రజా ప్రతినిధులు గాంధీ భవన్‌లో అందుబాటులో ఉండి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. స్వీకరించిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపించారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా ఉన్నారు.

వట వృక్షానికి మహిళల పూజలు



ఎల్లారెడ్డిలో పూజలు చేస్తున్న మహిళలు

మద్నూర్/ఎల్లారెడ్డిరూరల్/బిచ్కుంద : ఎల్లారెడ్డి పట్టణంలో, మద్నూర్, బిచ్కుంద మండల కేంద్రాల్లో మహిళలు వట వృక్షాలకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యేష్ఠ మాసంలోని పౌర్ణమిని పురస్కరించుకుని మహిళలు వట సావిత్రి వ్రతంలో భాగంగా మర్రి చెట్టుకు ప్రత్యేకంగా పూజలు చేశారు. మహిళలు వారి సౌభాగ్యాలు బాగుండాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం మహిళలు ప్రత్యేకంగా తయారు నైవేద్యాలను వట వృక్షానికి సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు ఉన్నారు.